ప్రజల చేతిలో

# ఆయుధం

www.ayudamdaily.com

The Common People's Voice

బుధవారం | జులై 29, 2026 | సంపుటి : 7 | సంచిక : 53 | పేజీలు : 2

## ముద్రా, జ్వాలామాలినిగా అమ్మవారు

- 14వ రోజు శాకంబరీ ఉత్సవాలు
- నేడు శాకంబరీ అలంకరణ




2 లో



## ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు

- హైడ్రాను బలోపేతం చేస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

**ఢిల్లీ, ఆయుధం:** హైడ్రా కమిషనర్ అంశంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో మీడియాతో సీఎం మాట్లాడారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశారని... కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించారన్నారు. పదెకరాలు కబ్జా చేస్తే కనకవర్షం కూడా కురిపించవచ్చని రేవంత్ ఎద్దేవా చేశారు. "హైడ్రా.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అతి పెద్ద సంస్కరణ. దీన్ని మరింత బలోపేతం చేస్తాం. హైడ్రా పనులను భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. ఎన్ కన్వెన్షన్ను కూల్చారు.. అది పేదలదా? కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. గతంలో సీఎస్గా పనిచేసిన సోమేశ్కుమార్పై 400 కోర్టు ధిక్కరణ కేసులున్నాయి. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం" అని రేవంత్ రెడ్డి అన్నారు.

# ఆఫ్‌లైన్‌తో పరీక్షా పత్రాల లీకేజీలు

## లీకేజీలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

- గ్లోబరీనా తరహా సంస్థలపై కఠిన చర్యలు
- ఇక ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు
- ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌తో భేటీ



**ఢిల్లీ, ఆయుధం:** ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇకపై ఏటా చెల్లిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ బకాయిల సమస్య ఉండదన్నారు. ఢిల్లీలో మీడియాతో సీఎం మాట్లాడారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలని చూసిన సంస్థలపై విచారణ జరుగుతోంది. బీఆర్ఎస్ హయాంలో బకాయిలు పెట్టిన రీయింబర్స్‌మెంట్ రూ.8వేల కోట్లు భారంగా మారింది. వాటిని మేం ఇవ్వట్లేదనే భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ అంశంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఆ పార్టీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పదేపదే ప్రశ్నిస్తున్నారు. ఆర్.కృష్ణయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీలో బకాయిలపై ఆయన మాట్లాడరు. ఆ రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉంది.. అక్కడి బకాయిలపై స్పందించి ఆ తర్వాత తెలంగాణ గురించి మాట్లాడితే బాగుంటుంది.

### గ్లోబరీనా తరహా సంస్థలపై కఠిన చర్యలు

ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణతో సమస్యలు వస్తున్నాయి. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి. విద్యా శాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోంది. యూనివర్సిటీలపై ఆధిపత్యం చెలాయించేందుకు యత్నిస్తోంది. విద్య.. వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయి. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టాం. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నాడు గ్లోబరీనా లాంటి సంస్థలు తెలంగాణలో అక్రమాలకు పాల్పడ్డాయి. నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల సీబీఎస్ఈకి విస్తరించారు. గ్లోబరీనా తరహా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలోనూ దానికి సంబంధించిన చట్టాలు రూపొందిస్తాం" అని రేవంత్ అన్నారు.

### శివరాజ్‌సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ

అంతకుముందు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. పీఎంఏవై 2.0 పథకం కింద రాష్ట్రానికి 11.56లక్షల ఇళ్లు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణలో గ్రామీణ ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో నేపథ్యంలో వీబీజీరామ్‌జీలో అదనపు పనులు చేర్చాలని సీఎం విజ్ఞప్తి చేశారు. రైతుల జీవనోపాధి మెరుగుకు 10 కొత్త పనులను ఆ పథకం కింద చేర్చాలని కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్లకు అనుమతి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పనులను వీబీజీరామ్‌జీ జాబితాలో చేర్చి లబ్ధిదారులకు 90 రోజులు పని కల్పించాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.



## ధైర్యంగా ఉండండి..

- ప్రభుత్వం తరపున సహకారం అందిస్తాం
- పెద్ది కుటుంబానికి పొంగులేటి, దొంతి ఓదార్పు

**హైదరాబాద్, ఆయుధం:** రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై, హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని, వారికి అత్యుత్తమ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని, ఆయన ఆరోగ్య సంరక్షణకు అవసరమైన అన్నిరకాల సహాయ సహకారాలు ప్రభుత్వం తరపున అందిస్తామని భరోసా ఇచ్చారు.



# రహదారులను అభివృద్ధి చేయండి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేత



**ఢిల్లీ, ఆయుధం:** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కీలక రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడంతో పాటు జాతీయ రహదారిపై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు.
ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కరుణాపురం నుండి పెద్ద పెండ్యాల, నర్సింగరావుపల్లి, ఎలుకుర్తి, ధర్మసాగర్ మండల హెడ్‌క్వార్టర్, దేవునూర్, సోమ దేవరపల్లి, దామెర, ఎల్కతుర్తి మండల హెడ్‌క్వార్టర్ వరకు ఉన్న రోడ్డును విస్తరించి బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఈ రోడ్డు హైదరాబాద్ నుండి కరీంనగర్, సిద్ధి పేటకు వెళ్లే వాహనాలు వరంగల్ వెళ్లే అవసరం లేకుండా 163, 563 జాతీయ రహదారులను అనుసంధానించే కీలక మార్గమని, వేలాది మంది ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపార వర్గాలు నిత్యం వినియోగిస్తున్నారని వివరించారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా ఈ రహదారిని అభివృద్ధి చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.
అలాగే యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 163) నాలుగు లైన్ల విస్తరణ సమయంలో పలు గ్రామాల్లో నిర్మించిన సర్వీస్ రోడ్ల మధ్య మిగిలిపోయిన లింకులను పూర్తి చేయాలని కోరారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, ఘన్‌పూర్ స్టేషన్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు ఉన్నప్పటికీ వాటి మధ్య అనుసంధానం లేకపోవడంతో స్థానిక ప్రజలు ప్రధాన రహదారినే వినియోగించాల్సి వస్తోందని తెలిపారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని వివరించారు. అవసరమైన భూమి ఇప్పటికే సేకరించిన నేపథ్యంలో మిగిలిన లింకుల నిర్మాణానికి వెంటనే ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.
అదేవిధంగా కేంద్ర రోడ్డు, మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) 2025-26 కింద తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన అదనపు రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపాలని కోరారు. నర్సంపేట-నందిగామ రహదారి విస్తరణ, భట్టుపల్లి-హంటర్ రోడ్ మార్గ అభివృద్ధి పనులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. ఈ ప్రాజెక్టులు అమలైతే గ్రామీణ ప్రాంతాల అనుసంధానం మెరుగుపడటంతో పాటు వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు.
వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక అవసరాలకు సంబంధించిన ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన ఆమోదం తెలపాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. వినతులను సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.




## కాజీపేట రైల్వే డివిజన్ సాధించే వరకు పోరాడుతాం

- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

**హనుమకొండ, ఆయుధం:** కాజీపేట రైల్వే డివిజన్ సాధించే వరకు పోరాడుతామని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన ఢిల్లీలో జంతర్‌మంతర్ ధర్నా కోసం తరలి వెళ్తున్న పార్టీ శ్రేణులకు ఆయన మంగళవారం ఉదయం కాజీపేట స్టేషన్ వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... పోరాటాలు మా పంథా అని, హక్కుల సాధన కోసం నిరంతరం ఉద్యమిస్తామని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన విధంగా తెలంగాణ రాష్ట్ర హక్కుల సాధనకు ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. భారత రాష్ట్రసమితి పార్టీగా మేము ఈ ప్రాంత ప్రజల అభీష్టం మేరకు పని చేస్తున్నామని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల 40 ఏండ్ల కోచ్ ఫ్యాక్టరీ కలను సాకారం చేసేందుకు పోరాడామని గుర్తు చేశారు. సాధించిన కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని, కాజీపేట రైల్వే డివిజన్ సాధన, భూమి ఇచ్చిన భూ బాధితులకు ఉద్యోగ అవకాశాలు, లోకో పైలెట్లు, రైల్వే పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం వరంగల్ పశ్చిమ నియోజవర్గ పార్టీ శ్రేణులతో కలిసి ఈ నెల 30న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుత ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, బొంగు అశోక్ యాదవ్, జోరిక రమేష్, సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్, ఐనవోలు సర్పంచ్ రఘువంశీ, నాయకులు పులి రజినీకాంత్, పులి విక్రమ్, దువ్వ కనకరాజు, కోండ్ర శంకర్, గబ్బెట శ్రీనివాస్, సుంచు అశోక్, సుధాకర్, అఫ్జల్, పున్నం చందర్, బరిగెల వినయ్, కిట్టు, నయీం జుబేర్, లడ్డు, గణేష్, రాబర్ట్, సదానందం, పాల్గొన్నారు.




## మాజీ సీఎస్‌ను కలిసిన కలెక్టర్

- నగరాన్ని సందర్శించిన మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు కుటుంబ సభ్యులు

**హనుమకొండ, ఆయుధం:** ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, 1962 బ్యాచ్ ఐఏఎస్ (రిటైర్డ్) అధికారి కాకి మాధవరావు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ప్రముఖ వేయి స్తంభాల ఆలయం, ఫోర్ట్ వరంగల్, భద్రకాళి ఆలయం పోతన విజ్ఞాన పీఠం ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు శ్రీ భద్రకాళి అమ్మవారి దేవస్థానంతో పాటు చారిత్రక ప్రాధాన్యం కలిగిన వేయి స్తంభాల దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకి మాధవరావు గారి కుమార్తె, ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కె. సునీత, ఐఏఎస్, ఆమె భర్త, ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ కొలవెంతి, ఐఏఎస్ (రిటైర్డ్) ఈ పర్యటనలో పాల్గొన్నారు. అలాగే కాకి మాధవరావు పెద్ద కుమార్తె, ప్రముఖ వైద్యురాలు, ఆమె భర్త తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కె.ప్రదీప్ చంద్ర, ఐఏఎస్ (రిటైర్డ్) కూడా ఈ సందర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ వాజపేయి, వారిని హరిత హోటల్ లో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

## స్టార్మ్ వాటర్ డ్రెయిన్ డీపీఆర్‌ను పూర్తి చేయాలి

- సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి




**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ నగరంలో ప్రతిపాదిత స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పన పనులను నాణ్యతా ప్రమాణాలతో, శాస్త్రీయంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న, ఇంజినీరింగ్ అధికారులతో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ డీపీఆర్ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ, నగరంలో వర్షపు నీటి పారుదల వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందించేలా డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వ, వరద ముంపు సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసి, సహజ వాగులు, నాలాలు, నీటి ప్రవాహ మార్గాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా డీపీఆర్‌ను రూపొందించాలని, పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. నగర భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన వర్షపు నీటి పారుదల వ్యవస్థ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రవికుమార్, సంతోష్ బాబు, సంజయ్ కుమార్, మాధవీలత, మహేందర్ అధికారులు పాల్గొన్నారు.

# శుద్ధి జలాల వినియోగానికి కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** శుద్ధి చేసిన మురుగు నీటిని సమర్థవంతంగా పునర్వినియోగం చేసుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద గ్రేటర్ వరంగల్‌కు మంజూరైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టులో నిర్మించే సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసే నీటిని వివిధ రంగాల్లో ఎలా సమర్థవంతంగా పునర్వినియోగించుకోవాలనే అంశంపై మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులు, కన్సల్టేషన్ లతో వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న, జీడబ్ల్యూఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, భూగర్భ జలాల శాఖ, నీటిపారుదల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖ, ఎన్ఐటీ, కాకతీయ విశ్వవిద్యాలయం, కుడా, రైల్వే, పోలీస్, ప్రభుత్వ ఆసుపత్రులు, పాల డెయిరీ, మత్స్యశాఖ, జూ పార్క్ తదితర అధిక నీటి వినియోగ సంస్థల ప్రతినిధులు, స్టేక్‌హోల్డర్లు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యూజీడీ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసిన నీటిని సరస్సుల పునరుజ్జీవనం, ఉద్యానవనాల నిర్వహణ, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, ఇతర బల్క్ వాటర్ వినియోగదారుల అవసరాలకు వినియోగించడం ద్వారా మంచినీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని చెరువుల పునరుద్ధరణ కొరకు వినియోగిస్తున్నామని, భవిష్యత్తులో దానిని ప్రత్యామ్నాయ జల వనరుగా వినియోగించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. సీడీఎంఏ కార్యాలయం నుంచి కన్సల్టెంట్లు లక్ష్మీప్రసన్న, సురభి, పాయల్ శుద్ధి చేసిన నీటి పునర్వినియోగానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించి, వివిధ శాఖలతో చర్చలు నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో ముకుందరెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, భూగర్భ జలాల శాఖ అధికారులు, జీడబ్ల్యూఎంసీ ఈఈలు రవికుమార్, మహేందర్, సంజయ్ కుమార్, మాధవి, సంతోష్ బాబు, సంబంధిత శాఖల అధికారులు, , స్టేక్‌హోల్డర్లు పాల్గొన్నారు.



## తక్కువ నీటితో సాగయ్యే పంటలు సాగు చేయాలి

- రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ఘనంగా నిర్వహణ
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖిగా మాట్లాడిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఎల్కతుర్తి రైతు వేదిక నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

2 లో

# తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ఘనంగా నిర్వహణ
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖిగా మాట్లాడిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఎల్కతుర్తి రైతు వేదిక నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నష్టాలను తగ్గించుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. వ్యవసాయ శాఖ నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి రైతులు, వ్యవసాయ అధికారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానాన్ని చేరవేయడంలో 'రైతు నేస్తం' కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని, ఆధునిక సాంకేతికత, నీటి యాజమాన్య పద్ధతులను అనుసరించాలని సూచించారు. రైతు భరోసా, రైతు బీమా పథకాలతో పాటు ఎరువుల సకాల సరఫరా కోసం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. 100వ ఎపిసోడ్ సందర్భంగా నిరంతరం కార్యక్రమానికి హాజరైన ప్రగతిశీల రైతులను సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తక్కువ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులు పెసర, కందులు, నువ్వులు, మినుములు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతు వేదికల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వాతావరణ శాఖ నిపుణులు రైతులకు నేరుగా సలహాలు అందిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఇంకా సాగు చేయని భూములను ఖాళీగా ఉంచకుండా తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి పంటల సాగు రైతులకు ఆదాయాన్ని అందించడంతో పాటు భూసారాన్ని కూడా మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. రైతులకు అనువైన పంటల వివరాలను రైతు వేదికల వద్ద ప్రదర్శనల ద్వారా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతు నేస్తం 100వ ఎపిసోడ్ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రగతిశీల రైతులను సన్మానించి, రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సర్పంచ్ లావణ్య, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## ముద్రా, జ్వాలామాలినిగా
# భద్రకాళి అమ్మవారు

- 14వ రోజు శాకంబరీ ఉత్సవాలు
- నేడు శాకంబరీ అలంకరణ

**వరంగల్, ఆయుధం:** వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు 14వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 5 గంటలకు నిత్యాహ్నికం అనంతరం తిథి మండల దేవతా యజనంలో భాగంగా కాళీ క్రమాన్ననుసరించి అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని ముద్రా గాను షోడశీ క్రమాన్ననుసరించి జ్ఞానశక్తిని జ్వాలామాలినీ గాను అలంకరించి పూజారాధనలు జరిపారు. ముదం లాతీతి ముద్రా, చతుర్దశి తిథికి అధిదేవతయైన అమ్మవారి యొక్క ఒక్క విభూతి భద్రకాళీ అమ్మవారి భక్తులకు సంతోషాన్ని ప్రసాదిస్తుంది. మనిషికి కోరిన కోర్కెలు నెరవేరినపుడు సంతోషం కలుగుతుంది. అంటే ఆ అమ్మవారు భద్రకాళీ అమ్మవారి యొక్క భక్తుల కోరిన కోర్కెలను నెరవేర్చి అమితమైన సంతోషాన్ని కలిగిస్తుంది కాబట్టి శాస్త్రములు అట్టి అమ్మవారిని ముద్రా అని కీర్తించాయి.

### 11 క్వింటాళ్ల కూరగాయలు

శ్రీ లక్ష్మీ శ్రీనివాస సేవా సమితి, మహబూబాబాద్ జి.కె. రెడ్డి ఆధ్వర్యంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత కు తమ సేవాసమితి సభ్యులు సుమారు 11 క్వింటాళ్ళ



కూరగాయలు అమ్మవారికి సమర్పించారు.

### నేడు శాకంబరీ ఉత్సవం

బుధవారం తెల్లవారుజామున 3గంటల నుండి నిత్యాహిరం అనంతరం అమ్మవారికి కూరగాయలు, పండ్లతో శాకంభరీ అలంకారము ప్రారంభమవుతుందని ఈవో సునీత తెలిపారు. ఉదయం 9 గంటల వరకు అలంకారము జరుగుతుందని.. ఈ సందర్భంలో భక్తులు అమ్మవారిని దర్శించుకొనుట వీలుపడదని తెలిపారు. అమ్మవారి అలంకారమునకు సుమారు 6 గంటలు పడుతుందని.. అలంకారము అనంతరం ఉదయం 9 గంటల నుండి సర్వదర్శనమునకు భక్తులు అనుమతిస్తామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనముతో పాటు విశిష్ట దర్శనం అతిశీఘ్రదర్శనం. ధర్మదర్శనం క్యూలైన్లు యథాపూర్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# విద్యార్థులపై పోలీసుల తీరు సరికాదు

- ప్రియాంకా గాంధీ

**జాతీయం, ఆయుధం:** యాంటీపేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకారులపై పెల్లెట్ గన్స్ వినియోగించడాన్ని, లాఠీఛార్జి చేయడాన్ని తప్పుబట్టారు. ఆయుధాలు ప్రయోగించడానికి వారేమైనా ఉగ్రవాదులా అని ప్రశ్నించారు. విద్యార్థుల మీద పోలీసుల దౌర్జన్యంపై ప్రధాని మోదీ.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశయువత తమ ప్రజాస్వామ్య హక్కులను శాంతియుతంగా వినియోగించుకుంటుండగా.. వారిపై దాడి చేయడం సరైన చర్య కాదన్నారు. విద్యార్థుల నిరసనను ఆయుధాలతో అణచివేయాలని పోలీసులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారని ఆమె ప్రశ్నించారు. పేపర్ లీక్‌ల కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పిల్లల్ని కోల్పోయిన తల్లిదండ్రుల బాధ ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు.

# కేయూ వీసీ ప్రతాప్ రెడ్డి ఆరోగ్యంగా నిలకడగా ఉంది



**హనుమకొండ, ఆయుధం:** కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.ప్రతాప్ రెడ్డి సోమవారం సాయంత్రం అస్వస్థకు గురికావడంతో హన్మకొండ లోని ప్రైవేటు హాస్పిటల్ లో చేర్చారు. సంబంధిత వైద్యులు పరీక్ష నిర్వహించిన అనంతరం యాంజియోగ్రామ్ చేసి స్టంట్ అమర్చినట్లు తెలిసింది. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స జరుగుతున్నట్లు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వీసీ ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆయన తెలిపారు.

# పార్కులు, గ్రాండ్ ఎంట్రెన్స్‌లు నగర ప్రతిష్ఠను ప్రతిబింబించాలి

- బల్దియా కమిషనర్ టి. వెంకన్న



**వరంగల్, ఆయుధం:** పార్కులు, గ్రాండ్ ఎంట్రెన్స్‌లు నగర ప్రతిష్ఠను ప్రతిబింబించాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో నగరంలోని హార్టికల్చర్ విభాగం పరిధిలోని పార్కులు, సెంట్రల్ మీడియన్లు, నర్సరీలు, గ్రాండ్ ఎంట్రెన్స్‌ల వద్ద చేపడుతున్న సుందరీకరణ పనులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. మొదట పబ్లిక్ గార్డెన్స్‌ను సందర్శించిన కమిషనర్ అక్కడ మొక్కల నిర్వహణ తీరును పరిశీలించారు. పార్కులో కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ, నడక మార్గాల వెంట ఎలాంటి చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పార్కులను సందర్శించే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచిస్తూ నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు.
అనంతరం ఎల్లాపూర్‌లో జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. వనమహోత్సవం సందర్భంగా పంపిణీ చేసేందుకు పెంచుతున్న మొక్కల వివరాలను హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి వద్ద తెలుసుకున్నారు. నర్సరీలో అన్ని రకాల మొక్కలను ఆరోగ్యవంతంగా పెంచి, వనమహోత్సవ కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తదుపరి ఎల్లాపూర్ కరీంనగర్ గ్రాండ్ ఎంట్రెన్స్ వద్ద చేపడుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. ప్రవేశ ద్వారం నగరానికి ప్రతీకగా నిలిచేలా, ఆకర్షణీయమైన అలంకార మొక్కలు, పూల మొక్కలతో అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. నగరంలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించేలా హరిత వాతావరణాన్ని మరింత అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. హసన్‌పర్తి అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రం వద్ద కొత్తగా అభివృద్ధి చేసిన గ్రీనరీ ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ అక్కడ మొక్కలు నాటారు. అనంతరం ఆరేపల్లి వద్ద ములుగు గ్రాండ్ ఎంట్రెన్స్‌ను సందర్శించి సుందరికారణ పనులను పరిశీలించారు. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించడం, మొక్కలకు అవసరమైన కత్తిరింపులు చేపట్టడం, పచ్చదనాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం ద్వారా నగర సౌందర్యాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని అన్ని పార్కులు, సెంట్రల్ మీడియన్లు, నర్సరీలు, గ్రాండ్ ఎంట్రెన్స్‌ల నిర్వహణలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, హరితీకరణ పనుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఏఈ వరుణ్, హార్టికల్చర్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వచ్చే నెల 6న ఫొటో ఎగ్జిబిషన్

**వరంగల్, ఆయుధం:** వరంగల్ కాశిబుగ్గ ఓ సిటి జంక్షన్లో టి.జేఏసీ నాయకులు ఆకెన వెంకటేశ్వర్లు అధ్యక్షతన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జన్మదిన సందర్భంగా ఫోటో ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ మానవ వనరుల అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ కొణతం కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. ఆగస్టు ఆరో తేదీన కాకతీయ యూనివర్సిటీ SDLCE మహిళ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్ లో జరిగే జయంతి ఉత్సవాలకు, తెలంగాణ వాదులు, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, మేధావులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.జేఏసీ నాయకులు పెరుమాండ్ల లక్ష్మణ్, గంగుల దయాకర్, టి.ఎన్. స్వామి, గంజి సాంబయ్య, మార్తా ఆంజనేయులు, అమృత బిక్షపతి, వెంకటస్వామి, వెంగళ సురేష్, జంగం రాజనర్సు, మడిపల్లి నాగరాజు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణవేణి మహిళా సంఘానికి సాయం



**వేలేరు, ఆయుధం:** వేలేరు మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి మహిళా సంఘానికి వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి మంగళవారం రూ.20వేల సాయం అందజేశారు. వేలేరు మండల కేంద్రంలో ఇటీవల మహిళా సంఘం(వివో) బిల్డింగ్ ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బిల్డింగ్ లో టేబుల్, ఫర్నిచర్ కోసం రూ.10వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. కాగా, మరొక రూ.10వేలు వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి కలిపి.. మొత్తం రూ.20వేలను లను శ్రీకృష్ణవేణి మహిళా సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు అందజేశారు.

# ఈ నెల 30న హన్మకొండలో స్టూడెంట్ మార్చ్

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు




**హనుమకొండ, ఆయుధం:** పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందించే ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈనెల 30న హన్మకొండలో తలపెట్టిన "స్టూడెంట్ మార్చ్" ను విజయవంతం చేయవలసిందిగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తెలిపారు. మంగళవారం హనుమకొండలోని గ్రేటర్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 20 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై ఆధారపడి చదువుకుంటున్నారని, ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేస్తే విద్యార్థుల జీవితాలు నాశనం అవుతాయని, పేదవాడికి ఇంజనీరింగ్, మెడిసిన్, లాంటి చదువులు అందని ద్రాక్షగా మిగులుతాయన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ద్వారా అనేక పేద కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతంగా ఎదిగాయన్నారు. ప్రభుత్వం సరైన సమయంలో ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయని కారణంగా రూ. 11వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి యేట 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, విద్యార్థులు సర్టిఫికెట్స్ తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బకాయిలు చెల్లించడంతో పాటుగా, గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఫీజులు చెల్లిస్తామని చెప్పిన నేటి ముఖ్యమంత్రి తానే విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో ఈ విషయం కోర్టు మెట్లు ఎక్కిందనీ అన్నారు. ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో విద్యార్థులు బలి అవుతున్నారని, బడ్జెట్ కాలేజీలు సైతం మూతపడుతున్నాయని, పొట్టకూటి కోసం లెక్చరర్ గా మారిన నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్స్ అనేవి విద్యార్థుల హక్కు అని ప్రభుత్వం వేసే బిక్ష కాదన్నారు. ప్రభుత్వం కళ్ళు తెరవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. మానవవనరులను తయారుచేసే విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ఘనత రేవంత్ రెడ్డిదేనని, కమిషన్లకు అలవాటు పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్లు రావనే బకాయిలు విడుదల చేయట్లేదని అన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్ బాధిత విద్యార్థుల మరణాలకు, గురుకులాల్లో విద్యార్థుల మరణాలకు భాధ్యత వహించి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జులై 30న హన్మకొండలో చేపట్టబోయే స్టూడెంట్ మార్చ్ తో రేవంత్ రెడ్డికి విద్యార్థుల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూపల్లి దీపిక, వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, సిద్దు, కృష్ణ, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం



**నడికూడ, ఆయుధం:** ప్రాథమిక పాఠశాల చర్లపల్లి నందు "ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం" పురస్కరించుకొని "ధరిత్రి హారతి – ప్రకృతి ప్రగతి "అనే నినాదం తో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ భావితరాల సుస్థిర భవిష్యత్తుకు ఇదే పునాది మార్గం అని, చెట్లను కౌగిలించుకుని, ప్రాణాలొడ్డిన చిప్కో అని, దక్షిణాదిన అడవులను బతికించిన అప్పికో అని, జీవవైవిధ్యాన్ని నిలిపిన సైలెంట్ వ్యాలీ అని, నదీ రక్షణకై సాగిన నర్మదా బచావో అని, ప్రకృతి కోసం ప్రాణాలనే అర్పించిన బిష్ణోయ్ అని, ఈ ఉద్యమాలే కదా భారతావనికి మణిదీపాలు అని, జగత్తుకు పర్యావరణ పాఠాలు నేర్పిన ఆదర్శాలు అని, ప్రకృతి సంపదల విలువను గుర్తిద్దాం అని సహజ వనరులను పొదుపుగా వాడుకుందాం అని,ఇది ఒక్కరితో సాధ్యం కాని మహా యజ్ఞం అని,ప్రతి వ్యక్తి, ప్రతి సమాజం, ప్రతి దేశం పాలుపంచుకోవాలి అని, ఉమ్మడి బాధ్యతగా పచ్చదనాన్ని నింపాలి అని, నేల, నీరు, గాలిని కలుషితం చేయకుండా చూద్దాం అని, రాబోయే తరాలకు స్వచ్ఛమైన సృష్టిని అందిద్దాం అని, ప్రకృతిని మనం రక్షిస్తే.. ఆ ప్రకృతి మనల్ని రక్షిస్తుంది అని, ఈ ఉద్యమాల స్ఫూర్తితోనే రేపటి లోకం వర్ధిల్లుతుంది అని నినదిస్తూ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచ రాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య, ప్రీ ప్రైమరీ టీచర్ శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇన్‌స్టా, ఫేస్‌బుక్, గూగుల్, ఎక్స్‌కు కేంద్రం నోటీసులు

**జాతీయం, ఆయుధం:** ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, గూగుల్ వంటి పలు సామాజిక మాధ్యమాలకు కేంద్రం సమన్లు జారీ చేసింది. డేటా గోప్యత, ఇతర నిబంధనలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఆగస్టు 3న సోషల్ మీడియా ప్రతినిధులతో పార్లమెంటరీ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కమిటీ ఛైర్మన్, భాజపా ఎంపీ నిశికాంత్ దూబే ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.
"ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సప్, గూగుల్, స్నాప్‌చాట్, ఎక్స్ (ట్విట్టర్) సంస్థలకు కేంద్రం సమన్లు జారీ చేసింది. వినియోగదారుల వ్యక్తిగత భద్రతకు, డేటా ప్రైవసీకి అమలు చేస్తున్న నిబంధనలపై ఆ సంస్థల ప్రతినిధులు వివరణ ఇవ్వాలి. మహిళలు, చిన్నారులు, రైతులు, కార్మికులు ఇలా ప్రజా భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలి. ఆగస్టు 3న సాయంత్రం 4 గంటలకు సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం ఉంటుంది'' అని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, భాజపా ఎంపీ నిశికాంత్ దూబే తెలిపారు. కాగా, నీట్ యూజీ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల నిరసనను ప్రచారం చేయడానికి కాక్రోచ్ జనతా పార్టీ విస్తృతంగా సామాజిక మాధ్యమాలను వినియోగించింది. ఈ క్రమంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

# వైభవంగా సింహాచలం గిరి ప్రదక్షిణ..

## భారీగా తరలివచ్చిన భక్తులు



**విశాఖపట్నం, ఆయుధం:** సింహాచలం గిరిప్రదక్షిణ అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. భారీగా తరలివచ్చిన భక్తులు సింహాద్రి అప్పన్న నామస్మరణతో ముందుకు కదులుతున్నారు. దీంతో గిరి ప్రదక్షిణ మార్గాలన్నీ కిటకిటలాడుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, స్థానికులు అల్పాహారం, తాగునీటి సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల ద్వారా గుర్తించి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గిరి ప్రదక్షిణ మార్గాల్లో 33 చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. అత్యవసర సేవల నిమిత్తం 26 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. అధికారులు, పోలీసుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో గిరి ప్రదక్షిణ కొనసాగుతోంది.

# దళిత క్రైస్తవ శాంతి యుత మహాదీక్షలను జయప్రదం చేయాలి




**హనుమకొండ, ఆయుధం:** రెండు రాష్ట్రాల్లో ఆగస్టు 3నుండి 7వ తేదీ వరకు 5 రోజులు అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే దళిత క్రైస్తవ శాంతి యుత మహాదీక్షలను విజయవంతం చేయాలని దళిత క్రైస్తవ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఈర్ల కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రెస్ క్లబ్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవుల ఎస్సి హోదాను సాధించడం కోసం ఆగస్టు 3 నుండి 7వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో దళిత క్రైస్తవ శాంతి యుత మహాదిక్షలను అందరు భాగస్వాములై విజయం వంతంచేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 10న దళితుల మత స్వేచ్ఛ హక్కులు కాలరాసిన బ్లాక్ డే నిరసనగా హన్మకొండ జిల్లా కేంద్రం డాక్టర్ అంబేద్కర్ విగ్రహం నుండి వరంగల్ జిల్లా కలెక్టర్ వరకు దళిత క్రైస్తవ శాంతి యుత నిరసన ర్యాలీకి దళిత సమాజం దళిత క్రైస్తవ సమాజం స్వచ్ఛంధంగా వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. మతం వ్యక్తిగతం కులం సామాజికం కాబట్టి, సామాజిక వివక్ష ఉన్నంత కాలం దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమా వేశంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను ఇవ్వాలని దేశంలోని అన్ని రాష్ట్రాల ఎం.పిలు మాట్లాడి, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవ ఐక్యవేదిక DCIV రాష్ట్ర నేతలు మాదాసి బిక్షపతి మాదిగ, సందేలా లాజర్, ఎర్రోళ్ల బాబు, నాగారపు స్వామి, మేకల బాబు, సిలువేరు నగేష్, జన్ను శ్యామ్, పాస్టర్లు దైవసేవకులు బరిగల జనార్దన్, నలగంటి విల్సన్, పాస్టర్ చిదిరల ముకేశ్, డాక్టర్ గణిపాక క్రాంతి, ఆరిశం శంకర్, ఈర్ల హరినాథ్, వెండి రాజు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by V.P.CHANDER. On Behalf of VNR MEDIA. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695